బీఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశం సందర్భంగా పార్టీ అధినేత కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు పూలమొక్క అందజేస్తున్న మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీలు వాణీదేవి, శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, మాధవరం కృష్ణారావు, ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

రజతోత్సవంపై దిశానిర్దేశం

హైదరాబాద్, రంగారెడ్డి నేతలతో కేసీఆర్ భేటీ

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుక్రవారం హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నేతలతో తన ఎర్రవల్లి నివాసంలో సమావేశమయ్యారు. వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ సన్నాహక ఏర్పాట్లపై వారికి కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఈ రజతోత్సవ సంబురాల కోసం ఉమ్మడి జిల్లాల వారీగా వరుస సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఈ సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్‌రావు, వాణీదేవి, దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, మాగంటి గోపీనాథ్, బండారి లక్ష్మారెడ్డి, డీ సుధీర్‌రెడ్డి, ముఠా గోపాల్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యేలు పార్టీ నేతలు, డాక్టర్ మెతుకు ఆనంద్, కొప్పుల మహేశ్‌రెడ్డి, పైలట్ రోహిత్‌రెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పటోళ్ల కార్తీక్‌రెడ్డి, మన్నె గోవర్ధన్‌రెడ్డి, జయసింహ, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు మన్నె క్రిశాంక్, గజ్జెల నగేశ్, నాయకులు నివేదిత సాయన్న, పంజుగుల శ్రీశైల్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సంతోష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, పార్టీ నేత కల్వకుంట్ల వంశీధర్‌రావు తదితరులు కూడా పాల్గొన్నారు.

లోకం పోకడ

ప్రపంచంలోని ప్రతి పౌరుడి 'జిబ్లీ'ఫోటోపై డౌన్‌లోడ్ సుంకం కూడా వసూలు చేద్దాం సార్!

అక్రమ కేసులకు అధైర్యపడొద్దు

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

ములుగు, ఏప్రిల్4 (నమస్తే తెలంగాణ): ములుగు జిల్లాలో మంత్రి సీతక్క కనుసన్నల్లో పోలీస్ రాజ్యం నడుస్తున్నదని, బీఆర్ఎస్ నాయకులపై నమోదవుతున్న అక్రమ కేసులకు కార్యకర్తలు అధైర్యపడొద్దని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ములుగు జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు అధ్యక్షతన రజతోత్సవ మహాసభ ముఖ్యనాయకుల సన్నాహక సమావేశం నిర్వహించారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్క కాంగ్రెస్ నాయకుడిపై అక్రమ కేసులు పెట్టింది లేదని గుర్తుచేశారు. 15 నెలలుగా ములుగు జిల్లాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని తెలిపారు. కేసుల విషయంలో కార్యకర్తలు అధైర్యపడొద్దని, పార్టీ నాయకత్వం, జిల్లా నాయకత్వం అండగా ఉంటుందన్నారు. కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండాను ఎగురవేసేందుకు కృషి చేయాలని సూచించారు. బీఆర్ఎస్ ఆవిర్భవించి 25సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో కేసీఆర్ నాయకత్వంలో జరగనున్న రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా నుంచి సభకు 15వేల మంది తరలిరావాలని తెలిపారు.

సిద్దిపేటలో పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

మూగజీవాలూ రేవంత్‌ను క్షమించవు

- హైడ్రా పేరుతో విధ్వంసం
- వానకాలం రైతుభరోసా ఎగ్గొట్టిండు
- రుణమాఫీ సగం చేసి ఆగంజేసిండు
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శ
- వరంగల్ సభకు సిద్దిపేట నుంచి 20 వేల మంది జనసమీకరణ
- పార్టీ ముఖ్య నాయకులకు దిశానిర్దేశం

సిద్దిపేట, ఏప్రిల్ 4(నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'రాష్ట్రంలో పాలన గాడి తప్పింది. మూగ జీవాలు కూడా రేవంత్‌రెడ్డిని క్షమించవు. హైడ్రా పేరుతో విధ్వంసం చేసి పేద ప్రజల జీవితాలను నాశనం చేసిండు' అని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. శుక్రవారం సిద్దిపేటలోని క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ రజతోత్సవసభ సన్నాహక సమావేశాల్లో భాగంగా సిద్దిపేట ముఖ్య నాయకులకు దిశానిర్దేశం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రా పేరుతో పేద ప్రజల జీవితాలు నాశనం చేసిండు, భూముల అమ్మకాల పేరుతో మూగజీవాల గోస పోసుకున్నాడు, రైతులకు సగం రుణమాఫీ చేసి చేతులు ఎత్తేసిండని మండిపడ్డారు. 13 వేల కోట్లు రైతుబంధు డబ్బులు ఎగ్గొట్టి, కేవలం 14 వేల కోట్లు రుణమాఫీ చేశారని వివరించారు. ప్రభుత్వం వైఫల్యంతో చేర్యాల, మద్దూరు, బచ్చన్నపేట జనగాంలో 50వేల ఎకరాల్లో పంట ఎండిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రంగనాయకసాగర్‌లో ఒక టీఎంసీ నీళ్లు తెప్పిస్తే సిద్దిపేట నియోజకవర్గంలో ఒక్క ఎకరం కూడా ఎండిపోకుండా ఉందని చెప్పారు. ప్రభుత్వం వైఫల్యాలను వరంగల్ సభలో ఎండగడుతామని పేర్కొన్నారు. సిద్దిపేట నియోజకవర్గం నుంచి 20 వేల మందికి పైగా పార్టీ సభకు తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. మరో వెయ్యిమందితో విద్యార్థులు, యువత పాదయాత్రగా తరలివెళ్తారని చెప్పారు. వంద ట్రాక్టర్లతో ర్యాలీగా సభకు బయలుదేరాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. నంగునూర్ మండలం పీఏసీఎస్ చైర్మన్ మహిపాల్ రెడ్డి వరంగల్ సభ ఖర్చులకు తన వంతుగా రూ.25 వేలు ప్రకటించారని చెప్పారు. మందపల్లి గ్రామస్థులు కూలి పని చేసే తామే స్వచ్ఛందంగా సభకు వస్తామని తెలిపారని చెప్పారు. 27న ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగురవేయాలని కార్యకర్తలకు సూచించారు. కోనాయిపల్లి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించాలని చెప్పారు.

మహాసభను విజయవంతం చేద్దాం

మాజీ మంత్రి సత్యవతి పిలుపు

మహబూబాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ) : 27న ఎల్కతుర్తిలో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు కవిత నివాసంలో మాజీ మంత్రి రెడ్యానాయక్ అధ్యక్షతన డోర్నకల్ నియోజకవర్గ ముఖ్యకార్యకర్తలతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో సత్యవతి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇంత త్వరగా వ్యతిరేకత వస్తుందని అనుకోలేదన్నారు. మహిళలకు రూ.2500, పింఛన్లు రూ.4వేలు, రైతు భరోసా రూ.15వేలు, ఆడబిడ్డల పెండ్లికి తులం బంగారం ఇస్తామన్న మాటలు ఇప్పుడు ఎటు పోయాయని ప్రశ్నించారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు కవిత మాట్లాడుతూ.. బహిరంగ సభకు డోర్నకల్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి సంపూర్ణ మద్దతు ప్రకటించాలని కోరారు. మాజీ మంత్రి రెడ్యానాయక్ మాట్లాడుతూ.. రజతోత్సవ సభకు డోర్నకల్ నియోజకవర్గం నుంచి 20వేల మంది తరలిరావాలని పిలుపునిచ్చారు.

కనగల్ పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ బండమీది రాము

కోమటిరెడ్డిపై పోస్ట్ .. బీఆర్ఎస్ నేత అరెస్ట్

నల్లగొండ సిటీ, ఏప్రిల్ 4 : రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై ఎక్స్‌లో పోస్ట్ పెట్టాడని నల్లగొండ జిల్లా కనగల్ మండలం మార్తోనిగూడేనికి చెందిన మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు బండమీది రామును శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కనగల్ మండలం జీ.ఎడవల్లి గ్రామంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి హెలికాప్టర్‌లో వచ్చిన విషయమై ఎక్స్‌లో పోస్ట్ పెట్టాడని పేర్కొంటూ పోలీసులు తెల్లవారుజామున 4 గంటలకు అతడి ఇంటికి వచ్చి నిద్రలేపి మరీ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వదిలి పెట్టారు.

బీఆర్ఎస్ నాయకుడిపై క్రిమినల్ కేసు

బెల్లంపల్లి, ఏప్రిల్ 4 : మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణ బీఆర్ఎస్ నాయకుడు నూనెటి సత్యనారాయణపై శుక్రవారం క్రిమినల్ కేసు నమోదు చేసినట్టు తాళ్లగురిజాల ఎస్ఐ రమేశ్ తెలిపారు. మండల శివారులోని డబుల్ బెడ్ రూం ఇండ్ల ముందు ఉన్న ఖాళీ స్థలాన్ని ఎమ్మెల్యే గడ్డం వినోద్ సహకారంతో కొంతమంది కాంగ్రెస్ నాయకులు కబ్జా చేస్తున్నారని బెల్లంపల్లి నియోజకవర్గం, బెల్లంపల్లి పొలిటికల్ గ్రూప్‌లలో అసత్యప్రచారం చేశారని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. అసత్యప్రచారం చేసి శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్. చిత్రంలో అభిలాష్, అరుణ, తుంగ బాలు, చిరుమల్ల రాకేశ్

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు

- హత్యాచారాలు, దాడులు నిత్యకృత్యం
- శాంతిభద్రతల రక్షణలో సర్కార్ విఫలం
- హోం మంత్రిత్వ శాఖ తన చేతుల్లో ఉన్నా చోద్యం చూస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి
- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): 'కాంగ్రెస్ పాలనలో మహిళలకు రక్షణ కరువైంది.. వారంలోనే నలుగురిపై హత్యాచారాలు జరగడమే ఇందుకు నిదర్శనం' అని బీఆర్ఎస్ నేత డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. రాష్ట్రంలో నేరాలు పెరిగి శాంతిభద్రతలు అదుపు తప్పుతుంటే హోంమంత్రిత్వ శాఖను తన వద్దే అట్టి పెట్టుకున్న సీఎం రేవంత్‌రెడ్డి చోద్యం చూస్తున్నారని ధ్వజమెత్తారు. కనీసం సమీక్ష చేయకపోడం, బాధితులను పరామర్శించకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. నేరాలను అదుపు చేయాల్సిన పోలీసులు.. బీఆర్ఎస్ నేతలు, విద్యార్థులపై కేసులు పెట్టడంలో బిజీగా ఉంటున్నారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శుక్రవారం బీఆర్ఎస్ నేతలు అభిలాష్, అరుణ, తుంగ బాలు, చిరుమల్ల రాకేశ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. మహిళలపై రోజుకో చోట దాష్టీకాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. అఘాయిత్యాలను నిరోధించడంలో కాంగ్రెస్ సర్కారు ఘోరంగా విఫలమైందని దుయ్యబట్టారు. మేడ్చల్‌లో ఎంఎంటీఎస్‌లో ఓ యువతిపై లైంగికదాడికి దుండగులు యత్నించారని, సంగారెడ్డి జిల్లా కందిలో మద్యం మత్తులో ఉన్న దుండగులు భర్తను కట్టేసి వివాహితపై లైంగికదాడి చేశారని, నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఓ గుడి సమీపంలో ఓ మహిళపై సామూహిక లైంగికదాడికి ఒడిగట్టారని, మార్చి 31న పహాడీషరీఫ్‌లో జర్మనీ యువతిపై లైంగికదాడి జరిగిందని వివరించారు. ప్రతిరోజూ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షలు, రాజకీయ చర్చలు జరుపుతున్న సీఎం రేవంత్‌రెడ్డి అతివలపై జరుగుతున్న హత్యాచారాలపై ఒక్కసారి కూడా సమీక్షించలేదని విమర్శించారు.

కేసీఆర్ పాలనలో ప్రత్యేక చర్యలు

కేసీఆర్ పాలనలో మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టారని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చెప్పారు. 331 షీటీం బృందాలు, 11 లక్షల సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతోపాటు పోలీసులకు రూ.700 కోట్లతో అధునాతన వాహనాలను సమకూర్చారని, దిశ ఘటనలో నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ పాలనలో పోలీస్ వ్యవస్థను గాలికొదిలేశారని దుయ్యబట్టారు. డయల్ 100కు కాల్‌చేసినా స్పందన కరువైందని చెప్పారు. పోలీసులంటేనే సమాజంలో నమ్మకం పోతున్నదని తెలిపారు. నేరస్థులను వదిలిపెడుతున్న పోలీసులు.. ప్రశ్నిస్తున్న మన్నె క్రిశాంక్, దిలీప్ కొణతం తదితర బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు బనాయించడంలో ముందుంటున్నారని నిప్పులు చెరిగారు. హెచ్‌సీయూలో 400 ఎకరాలను కాపాడేందుకు ఉద్యమిస్తున్న విద్యార్థులపై లాఠీలు ఝులిపించడంలో మాత్రం ఎనలేని ఉత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రోజూ మహిళలపై దాడులు జరుగుతుంటే మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద మాత్రం ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు.

దక్షిణ, మధ్య తెలంగాణలో మళ్లీ వర్షం

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తేతెలంగాణ): దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో శుక్రవారం తెలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసినట్టు వాతావరణ శాఖ వెల్లడించింది. కామారెడ్డి జిల్లాలో కొన్ని చోట్ల వడగండ్ల వాన పడిందని తెలిపింది. కొత్తగూడెంలో పలు చోట్ల భారీ వర్షాలు కురిశాయని పేర్కొంది. కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వాన పడినట్టు తెలిపింది. వర్షాల నేపథ్యంలో ములుగు, సిద్దిపేట, హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి, నారాయణపేట్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్, ఖమ్మం జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. గురువారం భద్రాద్రికొత్తగూడెంలో అత్యధికంగా 17 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ వెల్లడించింది. హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో 6 నుంచి 9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు తెలిపింది. యాదాద్రి-భువనగిరి జిల్లా నారాయణపూర్‌లో 9.8 సెంటీమీటర్లు నమోదు కాగా హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో 9.6, డబీర్‌పురాలో 9.45, అంబర్‌పేటలో 9, సరూర్‌నగర్‌లో 9.35, ముషీరాబాద్‌లో 9.43 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. శనివారం నుంచి గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నదని తెలిపింది.

ఢిల్లీలో నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలుపుతున్న ఎంపీలు సురేశ్‌రెడ్డి, వద్దిరాజు

అన్ని రంగాల్లో బీసీలకు అన్యాయం

బీసీలకు మంత్రిత్వశాఖ లేకపోవడం బాధాకరం • బీసీ మహాసభ దీక్షలో సురేశ్‌రెడ్డి, వద్దిరాజు

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): దేశ జనాభాలో 50 శాతం ఉన్న బలహీనవర్గాలకు అడుగడుగునా అన్యాయం జరుగుతున్నదని ఎంపీలు సురేశ్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర ఆవేదన వ్యక్తంచేశారు. ఢిల్లీలో హిందూ బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్, రాష్ట్ర విభాగం అధ్యక్షుడు పర్వతం సతీశ్, ఓబీసీ స్టూడెంట్స్ జేఏసీ చైర్మన్ జక్కని సంజయ్ చేపట్టిన ఆమరణ నిరాహారదీక్ష శిబిరాన్ని గురువారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 80 ఏండ్లు అవుతున్నా కేంద్రంలో బీసీలకు మంత్రిత్వశాఖ లేకపోవడం బాధాకరమని అన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఓబీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేశారని గుర్తుచేశారు. కానీ రాష్ట్రసర్కారు బీసీల అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. నిజంగా రేవంత్ సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే ఆరు మంత్రి పదవుల్లో బీసీలకు నాలుగు కేటాయించాలని, 42 శాతం రిజర్వేషన్లు ఖరారు చేసిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా జనాభా లెక్కలతోపాటు కులగణన కూడా చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం.. స్థానికంలో బీసీలకు 42% రిజర్వేషన్ అమలుకు కేంద్రంతో పోరాడితే తమ పార్టీ రాజ్యసభలో మద్దతునిస్తుందని స్పష్టంచేశారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డొస్తే.. ఎమ్మార్వో, ఆర్ఐని తన్నుతా

మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్ నేత దౌర్జన్యం

అనుమతికిమించి ఇసుక తరలించొద్దన్నందుకు జూనియర్ అసిస్టెంట్‌పై వీరంగం

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అతను ఓ మండల కాంగ్రెస్ ప్రెసిడెంట్.. స్థానిక ఎమ్మెల్యేకు ముఖ్య అనుచరుడు.. గ్రామాల్లో సీసీ రోడ్లకు ఇసుక తరలించేందుకు అనుమతి తీసుకొని అక్రమంగా ఇసుకను తరలిస్తుండడంతో అడ్డుకున్న ఓ రెవెన్యూ ఉద్యోగిపై ఫోన్‌లో బెదిరింపులకు దిగాడు. నిన్ను, ఆర్ఐని, ఎమ్మార్వోని కలిపి తంతా.. అంటూ మాట్లాడిన ఓ ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండల కేంద్రంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం మూసాపేట మండలం నిజాలాపూర్ వాగు నుంచి కొన్ని రోజులుగా కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి ప్రధాన అనుచరుడు కావడంతో రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నది. నిజాలాపూర్‌లోని వాగు నుంచి అనుమతికిమించి ఇసుక తరలింపుపై అభ్యంతరం తెలిపిన రెవెన్యూ సిబ్బందిపై బూతులతో విరుచుకుపడ్డాడు. 'ఎవడ్రా నువ్వు.. నిన్ను, ఆర్ఐను, తాసీల్దార్‌ను ఆఫీసుకు వచ్చి తంతా'.. అంటూ బెదిరింపులకు దిగాడు. ఎమ్మెల్యే ఆదేశానుసారం సీసీ రోడ్లకు ఇసుక సరఫరాకు తాసీల్దార్ అనుమతినిచ్చారు. అయితే వాగు నుంచి ఎన్ని ట్రిప్పుల ఇసుక తరలిస్తున్నారు? రికార్డు నమోదు చేయాలని తాసీల్దార్ రికార్డు అసిస్టెంట్ చెన్న రాయుడును నియమించారు. అనుమతికి మించి ఇసుక తరలిస్తుండడంతో ఇదేమిటని అడ్డుకున్నారు. అక్కడున్న ట్రాక్టర్ డ్రైవర్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడికి సమాచారం ఇచ్చారు. దీంతో చెన్నరాయుడికి ఫోన్ చేసి 'నిన్ను ఎవడు పంపాడు రా.. ఇక్కడి నుంచి వెళ్లిపో.. లేదా మూసుకొని కూర్చో.. మాట్లాడితే తాసీల్దార్, ఆర్ఐ పేర్లు చెబుతావు.. రా.. రా.. ఆఫీస్‌కు అంటూ బెదిరించాడు. దీంతో తాసీల్దార్ ఆఫీస్‌కి వచ్చి ఘటనను అధికారులకు చెప్పాడు. అధికారులు మాత్రం ఇది ఎక్కడా చెప్పవద్దని.. ఆదేశించినట్టు సమాచారం.

నేడు విద్యార్థులతో మీనాక్షి భేటీ?

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ శనివారం హైదరాబాద్ రానున్నారు. ఉదయం హైదరాబాద్ చేరుకోనున్న ఆమె విద్యార్థి సంఘాల ప్రతినిధులతో సమావేశమవుతారు. హెచ్‌సీయూ భూముల విషయంలో వివాదంపైనే విద్యార్థులతో చర్చించనున్నట్టు తెలుస్తున్నది. సాయంత్రం గాంధీభవన్‌లో రాజకీయ వ్యూహబృందంతో సమావేశం నిర్వహిస్తారని సమాచారం. విద్యార్థులు, పార్టీ నేతలతో జరిపిన చర్చల తర్వాత హెచ్‌సీయూ భూముల వ్యవహారంపై అధిష్ఠానానికి నివేదిక సమర్పిస్తారని తెలుస్తున్నది.

రాహుల్‌జీ.. రేవంత్ వికృత పాలనపై మౌనమేల?

- కాంగ్రెస్ సిద్ధాంతాలను తుంగలో తొక్కుతుంటే పట్టించుకోరా?
- రాహుల్‌గాంధీకి బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు బహిరంగలేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): 'తెలంగాణలో మీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వికృత పాలనతో ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. ఫిరాయింపుల విషయంలో మీరు చెప్పిన నీతిసూత్రాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. బుల్డోజర్ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న మీరు తెలంగాణలో మీ పార్టీ ప్రభుత్వం హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరిట పేదల ఇండ్లపైకి బుల్డోజర్లను పంపుతూ అరాచకానికి దిగుతుంటే ఎందుకు మౌనంగా ఉంటున్నారు?' అంటూ హరీశ్‌రావు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన రాహుల్‌కు బహిరంగలేఖ రాశారు. రేవంత్ అరాచక పాలనపై ప్రజల నుంచి నిరసనలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

లేఖలోని అంశాలు..

- మీరు రాజ్యాంగ విలువల గురించి దేశమంతా తిరిగి మాట్లాడుతుంటే, రేవంత్‌రెడ్డి అనాలోచిత, అవగాహన రాహిత్యంతో రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారు.
- ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయిస్తే ఆటోమెటిక్‌గా డిస్‌క్వాలిఫై అయ్యేలా చట్టం చేస్తామని మీరు ఎన్నికల సమయంలో చెప్పారు. కానీ ఇందుకు విరుద్ధంగా ముఖ్యమంత్రి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపులను ప్రోత్సహించారు. ఇదే విషయంపై సుప్రీంకోర్టును సైతం అవమానించేలా అసెంబ్లీలో, బయట సభల్లో రేవంత్ వ్యాఖ్యలు చేశారు. సుప్రీంకోర్టు సైతం తీవ్రంగా తప్పుబట్టింది.
- దేశవ్యాప్తంగా బుల్డోజర్ రాజ్‌ను వ్యతిరేకిస్తున్న మీరు తెలంగాణలో రేవంత్ బుల్డోజర్ పాలనపై ఎందుకు మౌనం వహిస్తున్నారు? ఇక్కడ హైడ్రా, మూసీ ముసుగులో బుల్డోజర్లు పంపి పేద, మధ్యతరగతి ఇండ్లను కూలగొడుతుంటే కనిపించడంలేదా?
- ముఖ్యమంత్రి విధ్వంసపూరిత వైఖరి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చేరి వందల ఎకరాల్లో విధ్వంసానికి తెరతీసింది. జాతీయ పక్షి నెమలి సహా ఇతర పశు పక్షాదులు, జంతువులు ఆనవాళ్లు కోల్పోయాయి.
- ఈ దుర్మార్గాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమించిన హెచ్‌సీయూ విద్యార్థులు, ప్రొఫెసర్లపై పోలీసుల దాష్టీకం ప్రతిఒక్కరినీ కలిచివేసింది. ఒక్క కాంగ్రెస్ మినహా ఎన్ఎస్‌యూఐతో సహా అన్ని పార్టీలు, వర్గాలు తీవ్రంగా వ్యతిరేకించాయి.
- రోహిత్ వేముల ఆత్మహత్య సందర్భంలో హెచ్‌సీయూ సందర్శించిన మీకు అప్పటి బీఆర్ఎస్ సర్కారు ఎస్కార్ట్ ఇచ్చి, పోలీసు బందోబస్తు కల్పించి నిరసనకు అవకాశం కల్పించింది. ఆ సందర్భంలో ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని విద్యార్థులకు మీరు ఇచ్చిన హామీ గుర్తున్నదా? నేడు అదే యూనివర్సిటీలో మీ సీఎం రేవంత్‌రెడ్డి ఇంత దుర్మార్గం చేస్తుంటే మీరు స్పందించకపోవడం యావత్ తెలంగాణను ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. సుప్రీంకోర్టు ఆదేశించే దాకా సర్కారు విధ్వంసకాండను ఆపలేదు. ఈ విషయంలో మీరు, మీ పార్టీ మౌనంగా ఉండడానికి కారణాలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం.
- మీరు క్రోనీ క్యాపిటలిజానికి (ఆశ్రిత పక్షపాతం) వ్యతిరేకంగా, అదానీ వ్యాపార విస్తరణపై దేశవ్యాప్తంగా గట్టిగా పోరాటం చేస్తుంటే ఇక్కడ మీ ముఖ్యమంత్రి అదే అదానీకి రెడ్‌కార్పెట్ వేసి ఆహ్వానించిన విషయం మీకు తెలియదా? అదానీ సిమెంట్ ఫ్యాక్టరీకి భూసేకరణకు నల్లగొండ జిల్లాలో రైతులపై పోలీసులు దాడి చేస్తుంటే మీరు ఎందుకు పట్టించుకోలేదు?
- ఫార్మావిలేజ్ పేరిట పచ్చని పొలాల్లో చిచ్చురేపి, ఆదివాసీ రైతులను చితగ్గొట్టి, బేడీలు వేస్తే మౌనమునిగా చూస్తుండి పోయారెందుకు?
- ఒకవైపు మీరు మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తుంటే మరోవైపు మీ ముఖ్యమంత్రి ఆయనను బడే భాయ్ అని సంబోధిస్తున్న విషయం మీ దృష్టికి రాలేదా? ఇవన్నీ మీ అంగీకారంతోనే జరుగుతున్నాయా? తెలిసే మౌనం వహిస్తున్నారా? మీరు ప్రవచించే నీతి సూక్తులను మీ సీఎం పాటించేలా చూడాలని కోరుతున్నాం.

రోడ్డు ఆక్రమణలపై చర్యలు చేపట్టండి

కొంపల్లి మున్సిపల్ అధికారులకు హైకోర్టు ఆదేశం



హైదరాబాద్ ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గండిమైసమ్మ మండలం కొంపల్లిలోని 105 సర్వే నంబర్‌లో రోడ్డు ఆక్రమణలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని హైకోర్టు కొంపల్లి మున్సిపల్ అధికారులను ఆదేశించింది. రియల్ ఎస్టేట్ సంస్థ కాసాగ్రాండ్ హైడర్ వైజ్ ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీ జీ రంజిత్‌రెడ్డి ఆ రోడ్డును ఆక్రమించుకుని కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్నప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదన వినిపిస్తూ.. 40 అడుగుల రోడ్డును రియల్ ఎస్టేట్ సంస్థ ఆక్రమించి కాంపౌండ్ నిర్మిస్తోందని, దీంతో ఆ పక్కనే ఉన్న తన ప్లాట్‌కు దారి లేకుండా పోతోందని వివరించారు. దీనిపై మున్సిపల్ అధికారులకు వినతి పత్రం ఇచ్చినా పట్టించుకోలేదని తెలిపారు. దీంతో ఆ రోడ్డును ఆక్రమణలను పరిశీలించి, చట్టప్రకారం తగిన చర్యలు చేపట్టాలని హైకోర్టు మున్సిపల్ అధికారులను ఆదేశించింది.